క్లుప్తంగా

సమస్యలపై ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి వినతి



ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: స్పందన, ఎమ్మెల్యే కార్యాలయానికి అందిన వినతులను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలు విని, వారి నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. స్పందన, ఎమ్మెల్యే కార్యాలయం నుంచి అర్జీలను పరిష్కరించడంలో ఉద్యోగులు అలసత్వం వహించరాదన్నారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ ప్రభుత్వానికి జవాబుదారీగా ఉండాలన్నారు. నాలుగు మండలాల నుంచి ప్రజలు సమస్యలపై వినతిపత్రాలు ఎమ్మెల్యేకు అందజేశారు.

వలంటీర్లు అంకితభావంతో పనిచేయాలి

ఉంగుటూరు: వలంటీర్లు అంకితభావంతో పనిచేయాలని ఎంపీటీసీ ఛాంబర్ మండల అధ్యక్షుడు బండారు నాగరాజు అన్నారు. మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలనే ఉద్దేశ్యంతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చారని నాగరాజు అన్నారు. వలంటీర్ వ్యవస్థకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని అన్నారు. ప్రభుత్వ లక్ష్యాల సాధనకు అంకితభావంతో వలంటీర్లు పనిచేయాలని కోరారు. సమావేశంలో ఎంఎల్‌వో ప్రభు, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, సచివాలయ కన్వీనర్లు మతుకుమిల్లి శ్రీధర్, బండారు సురేఖ, మూర్తి శ్రీపాని బాలు పెంటారామకృష్ణ, కరుణ కుమారి, వలంటీర్లు పాల్గొన్నారు.

గోపన్నపాలెం గ్రామ కార్యదర్శిగా స్టానిష్ బాబు

దెందులూరు: గోపన్నపాలెం గ్రామ కార్యదర్శిగా స్టానిష్‌బాబు ఉద్యోగ బాధ్యతలు గ్రామ సచివాలయంలో మంగళవారం స్వీకరించారు. వేలేరుపాడు మండలం నుంచి బదిలీపై గోపన్నపాలెం సచివాలయానికి వచ్చారు. ఇప్పటి వరకు కార్యదర్శిగా పనిచేసిన జి.యహోషువా అత్తిలి మండలానికి బదిలీపై వెళ్లారు. నూతన కార్యదర్శి సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

సాల్వేషన్ ఆర్మీ చర్చి నిర్మాణానికి ఆర్థిక సాయం

దెందులూరు: సాల్వేషన్ ఆర్మీ చర్చి నిర్మాణానికి దెందులూరు ఎస్సై ఐ.వీర్రాజు మంగళవారం ఆర్థిక సాయం అందించారు. సాల్వేషన్ ఆర్మీ చర్చి కో ఆఫీసర్ లెఫ్టినెంట్ కే. సుధీర్‌కుమార్, ఉపసర్పంచ్ ప్రత్తిపాటి ముకుందరావు, చర్చి నిర్మాణ కమిటీ సభ్యులు నరెడ్ల దావీదు, కుమ్మరి ఏసురత్నం, జంగం మోషే చర్చి నిర్మాణానికి ఆర్థిక సాయం అందించిన ఎస్సైకు కృతజ్ఞతలు తెలిపారు.

బైర్రాజు సేవలు అమూల్యం

గణపవరం: గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు బైర్రాజు ఫౌండేషన్ అందిస్తున్న ఉచిత సేవలు అమూల్యమైనవని, పలువురు అన్నారు. బైర్రాజు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బైర్రాజు సత్యం వర్ధంతి సందర్భంగా గణపవరం మండలం కాశిపాడు బైర్రాజు ఫౌండేషన్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బైర్రాజు ఫౌండేషన్ అధ్యక్షుడు జంపన సూర్యనారాయణరాజు, సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఎంఎంపురంలో గడపగడపకు మన ప్రభుత్వం

భీమడోలు: పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురంలో ఈనెల 28న బుధవారం మధ్యాహ్నం 3 గటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు భీమడోలు మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు మంగళవారం రాత్రి తెలిపారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

మైనర్లు వాహనాలు నడపటం నేరం

ఏలూరు టౌన్: మైనర్లు మోటారు సైకిళ్లు నడిపితే చర్యలు తప్పవని ఏలూరు ట్రాఫిక్ ఎస్సైలు శ్రీనివాసరావు, శ్రీధర్ హెచ్చరించారు. ఏలూరు ట్రాఫిక్ స్టేషన్ వద్ద మంగళవారం మైనర్లకు వారు ప్రత్యేకంగా కౌన్సిలింగ్ ఇచ్చారు. మైనర్లు మోటారు సైకిళ్లు నడపటం నేరమని, వారి ప్రాణాలకు అపాయమని, ఎదుటివారి ప్రాణాలకు ముప్పు ఉంటుందని వివరించారు. ప్రతి తల్లిదండ్రులూ గమనించి, తమ పిల్లలకు మోటారు సైకిళ్లు ఇవ్వవద్దని, వాహన యజమానులు ట్రాఫిక్ నిబంధనలు అనుసరించాలని అన్నారు. ఇష్టారాజ్యంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మోటారు సైకిళ్ల పత్రాలను యజమానులు తమ వద్ద విధిగా ఉంచుకోవాలని సూచించారు.

ప్రభుత్వ పథకాలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు



బువ్వనపల్లి ప్రీహైస్కూల్లో తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో రాంబాబు



గణపవరం బాలికోన్నత పాఠశాలలో ప్రభుత్వ పథకాలను అభినందిస్తున్న విద్యార్థిని తల్లి



కైకరం జిల్లాపరిషత్ హైస్కూల్లో తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం ప్రసాదరావు

గణపవరం: జిల్లా వ్యాప్తంగా మంగళవారం ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల తల్లిదండుల సమావేశాలు అట్టహాసంగా పండుగ వాతావరణంలో నిర్వహించారు. నూతన విద్యాసంవత్సరం ఆరంభమైన సందర్భంగా ఈనెల 26, 27 తేదీల్లో రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన ఆదేశాలతో అన్ని పాఠశాలల్లో ఈ సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించడం, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపేలా వారికి అవగాహన కల్పించడం, పాఠశాల అభివృద్ధిని వివరించడం తదితర లక్ష్యాలతో ఈసమావేశాలను నిర్వహించారు. ఈనెల 28న ప్రభుత్వం నాలుగేళ్లుగా విద్యార్థుల తల్లులకు అందిస్తున్న అమ్మ ఒడి పథకం అమలు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఈనెల 28న అమ్మ ఒడి పథకం ద్వారా తల్లుల బ్యాంకు ఖాతాలకు నేరుగా రూ.13 వేల నగదు జమ చేస్తారు. దీనితో పాఠశాలల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశాలకు భారీగా విద్యార్థుల తల్లిదండ్రులు తరలిరావడంతో పాఠశాలల్లో పండుగ వాతావరణం నెలకొంది. మంగళవారం గణపవరం మండలంలోని సుమారు 60 ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలను నిర్వహించి ప్రభుత్వం పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి అమలుచేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న విద్యాపథకాలు దేశంలోని మరే రాష్ట్రంలోనూ లేవని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని గణపవరం ఎంఈవోలు పుచ్చల శేషు, గొర్లెల బాలయ్య కోరారు. మంగళవారం పలు పాఠశాలల్లో జరిగిన తల్లిదండ్రుల సమావేశాలకు వారు హాజరై ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యనందించే విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పలు పథకాలు చేస్తున్నారని తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆయా గ్రామాలలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, విద్యాకమిటీ చైర్మన్లు, తల్లిదండ్రులు హాజరయ్యారు.

విద్యార్థుల అభివృద్ధికోసం సీఎం జగన్ కృషి

ఉంగుటూరు: విద్యార్థుల అభివృద్ధి కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి ప్రశంసనీయమైనదని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం కైకరం హైస్కూల్లో పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హెచ్‌ఎం ప్రసాదరావు అధ్యక్షత వహించారు. హెచ్‌ఎం ప్రసాదరావు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తల్లిదండ్రులు విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలని కోరారు. సమావేశంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ శానం లక్ష్మణరావు, వైస్ చైర్మన్ చోడే జ్యోతి, పేరెంట్స్ కమిటీ సభ్యులు నాగరాజు, కె. సత్యనారాయణ, నూలు మంగ, బగాతి అంజిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా పథకాలు చిన్నారులకు వరం

దెందులూరు: జగనన్న అమ్మ ఒడి, గోరుముద్ద, విద్యాకానుకను అందరూ స్వీకరించి విద్యార్థులంతా ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకోవాలని గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్ అన్నారు. మంగళవారం గోపన్నపాలెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఏవీఎస్ ప్రసాద్ అధ్యక్షతన పేరెంట్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, తల్లిదండ్రుల ఉపాధ్యాయుల అడుగుజాడల్లో పయనిస్తూ ఎంచుకున్న లక్ష్యాలను అధిగమించాలన్నారు. హెచ్‌ఎం ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ నాగమణి, తెలుగు ఉపాధ్యాయులు మాసగిరి శ్రీనివాస్, హేబేలు, బుల్లియ్య తదితరులున్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



మండల ప్రజాప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి

దెందులూరు: దెందులూరు మండలంలో జూలై 1వ తేదీ నుంచి జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై 16వ విడత సోషల్ ఆడిట్ జరుగుతుందని దెందులూరు ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల ఏపీఓ దశరథ రాంజీ అధ్యక్షతన నిర్వహించిన మండలస్థాయి ప్రజాప్రతినిధులు, అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన స్టేట్ రిసోర్స్‌పర్సన్ చంద్రరాజు మాట్లాడుతూ దెందులూరు మండలంలో సోషల్ ఆడిట్ నిర్వహించేందుకు ఒక స్టేట్ రిసోర్స్ పర్సన్, 9 మంది జిల్లా రిసోర్స్ పర్సన్లు మండలానికి వచ్చారన్నారు. విలేజ్ సోషల్ ఆడిటర్లను ఎంపిక చేస్తారన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై ప్రతి గ్రామంలోనూ గ్రామసభ నిర్వహించి సమీక్షిస్తారని అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సహాయ సహకారాలు అందించాలన్నారు. జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చిన సీఎం జగనన్న



ఎంఎంపురంలో ఆర్‌బీకేను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యేలు పుప్పాల వాసుబాబు, కొఠారు అబ్బయ్య చౌదరి

భీమడోలు: దేశంలో ఎక్కడా లేని విధంగా ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు అన్నారు. పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురంలో మంగళవారం దివంగత పుప్పాల రామ్మూర్తి నాయుడు, పుప్పాల జయకృష్ణారావు (బుచ్చిబాబు) కుటుంబ సభ్యులు దానం చేసిన 20 సెంట్ల స్థలంలో రూ.40లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం-3, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావుతో కలిసి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ప్రారంభించారు. మాజీ సర్పంచ్ దివంగత పుప్పాల జయకృష్ణారావు 78వ జయంతిని పురస్కరించుకుని భారీ కేక్‌ను వాసుబాబు కట్ చేసారు. విద్యావేత్త డాక్టర్ పుప్పాల గోవర్ధన రామానుజం తన తండ్రి జయకృష్ణారావు ఆశయాలను పుణికి పుచ్చుకున్నారని అన్నారు. అనంతరం నిర్వహించిన సభకు పుప్పాల గోవర్ధన రామానుజం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఉంగుటూరు, దెందులూరు ఎమ్మెల్యేలు ప్రసంగించారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ గ్రామంలోని పుప్పాల గోవర్ధన రామానుజం పెద్ద మనస్సుతో 20 సెంట్ల స్థలాన్ని అందించారని అభినందించారు. సాంకేతిక కారణాల రీత్యా అర్హత ఉండి పథకాల లబ్ధి పొందని వారి ఇళ్ల వద్దకు అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లను పంపించి జగనన్న సురక్ష పథకం ద్వారా వారికి న్యాయం చేయడం చాలా సంతోషంగా ఉందని ఆయన అన్నారు. సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్, డీసీసీబీ డైరెక్టర్ కందుల పాటి రాజీలు, ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజాబాబు, ఉపసర్పంచ్ పెద్దిరెడ్డి హరిబ్రహ్మానాయుడు, మండల సాగు సలహా సంఘం అధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ, ఏడీఏ పి.ఉషారాజకుమారి, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, ఎంపీటీసీ గొండు కృష్ణ చైతన్య, సర్పంచులు గుడివాడ నాగగౌతమి సీతారామాంజనేయులు, ఏపూరి భానుదీపిక రాంబాబు, మానుకొండ నాగేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ మద్దుల రాజా, ఏఎంసీ వైస్ చైర్మన్ పులిచర్ల వెంకట కృష్ణారావు, పుప్పాల బుజ్జులు, బి.పవన్ పాల్గొన్నారు.

వాహనాలకు రేడియం స్టిక్కర్లు



రేడియం స్టిక్కర్లపై అవగాహన కల్పిస్తున్న టోల్‌ప్లాజా సిబ్బంది

ఉంగుటూరు: ఉంగుటూరు టోలు ప్లాజా వద్ద జాతీయ రహదారి భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం వాహనాలకు రేడియం స్టిక్కర్లు అతికించి వాటి వల్ల ప్రయోజనాలను వాహనదారులకు వివరించారు. ఈకార్యక్రమంలో టోలు ప్లాజా అధికార్లు, ఇంతియాజ్, జగదీస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు నగదు బహుమతులు



విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తున్న విద్యాశాఖాధికారులు

పెదపాడు: ప్రతిఫలాపేక్ష లేకుండా విద్యార్థుల కోసం రూ.వేల కోట్లు ఖర్చుచేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంఈఓలు సబ్బితి నర్సింహమూర్తి, డీవీరమణ, ప్రధానోపాధ్యాయులు పీ వెంకటేశ్వరరావు తెలిపారు. పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జగనన్న ఆణిముత్యాలు పథకంలో ప్రతిభచూపిన విద్యార్థులకు నగదు బహుమతులు, జగనన్న విద్యా కానుక అందించారు. ఈ సందర్భంగా నర్సింహమూర్తి, డీవీ రమణ, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని గుర్తించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను ప్రభుత్వ పాఠశాలలో అమలు చేస్తున్నారని అన్నారు. విద్యార్థులు ఇష్టంతో చదివితేనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని చెప్పారు. ఉత్తమ ఫలితాలను అందించిన విద్యార్థులను ఎంఈఓలు ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం నూతన ఎంఈఓలుగా బాధ్యతలు చేపట్టిన దేవినేని రమణ, సబ్బితి నర్సింహమూర్తిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రామకృష్ణారావు, పీ సుబ్రహ్మణ్యం, విద్యాకమిటీ చైర్మన్ ఆర్‌వీ నాయుడు పాఠశాల సీనియర్ ఉపాధ్యాయిని జీ విజయ పాల్గొన్నారు.

వట్లూరు రహదారి అభివృద్ధికి జెడ్పీ నిధులు



వట్లూరు రహదారిని పరిశీలిస్తున్న ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

పెదపాడు: వట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే రహదారి అభివృద్ధికి రూ.70లక్షల నిధులు కేటాయిస్తున్నట్లు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరు గ్రామ కూడలి నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మీదుగా ఐటీఐ కళాశాల వరకు ఉన్న రహదారిని జిల్లా రైసు మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరితో కలిసి రహదారిని పరిశీలించారు. పాఠశాల నుంచి గ్రామం చివర వరకు 700 మీటర్లు సీసీ రహదారి, పాఠశాల నుంచి ఐటీఐ వరకు ఆర్‌అండ్‌బీ రహదారి నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని పంచాయతీరాజ్ డీఈ సురేష్‌కు సూచించారు. రహదారి అభివృద్ధికి రూ.70లక్షల నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. వట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను పాఠశాల ఆవరణలో రూ.17లక్షల వ్యయంతో దాతల సహకారంతో నిర్మిస్తున్న భోజనశాలను పరిశీలించారు. బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, గ్రామ సర్పంచ్ గుజ్జుల నవీన్ రత్నకుమారి, ఉప సర్పంచ్ చింతా మధుసూధన రావు, ఎంపీటీసీ కనకదుర్గ, హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

టీడీపీకి మరోసారి గుణపాఠం ఖాయం

- ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు సహించేది లేదు
- వైఎస్సార్ సీపీ నాయకుల హెచ్చరిక



గుండుగొలనులో మాట్లాడుతున్న రావిపాటి సత్యశ్రీనివాస్, ఎంపీపీ కనమాల రామయ్య

భీమడోలు: ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్ హెచ్చరించారు. ఇటీవల గుండుగొలను సొసైటీ మహాజన సభను రైతుల సమావేశం కాకుండా రాజకీయ సమావేశంగా మార్చి ఎమ్మెల్యే వాసుబాబుపై గ్రామంలోని మండల టీడీపీ అధ్యక్షుడు దుర్భాలాషలాడడాన్ని వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు మంగళవారం తీవ్రంగా ఖండించారు. గుండుగొలను వైసీపీ గ్రామ పార్టీ కార్యాలయంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు ముదుండి సూర్యనారాయణరాజు అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు రావిపాటి సత్యశ్రీనివాస్, ఎంపీపీ కనమాల రామయ్య, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమ జూనియర్, సీనియర్ నాయకులు నంద్యాల సుబ్బరాజు, వైసీపీ జగన్‌సేవా దళ్ నియోజకవర్గ కన్వీనర్ తుమ్మగుంట రంగ, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ మద్దుల రాజా, వార్డు సభ్యులు, నాయకులు తీవ్రంగా స్పందిస్తూ టీడీపీ నేతను హెచ్చరించారు. టీడీపీకి రానున్న ఎన్నికల్లో మరోసారి గుణపాఠం ఖాయమని వారన్నారు. టీడీపీ హయాంలో గుండుగొలనులో జరిగిన అభివృద్ధి, ఎమ్మెల్యే వాసుబాబు హయాంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా వైసీపీ నాయకులు సవాల్ చేశారు. గుండుగొలనులో నాలుగేళ్లలో రూ.56 కోట్ల విలువ గల అభివృద్ధి పనులు వాసుబాబు చేయించారన్నారు. 16 వార్డుల్లోనూ ట్రాన్స్‌ఫార్మర్లు, రూ.3.5కోట్ల సబ్ స్టేషన్, గోదావరి కాల్వపై వంతెన, బెయిలీ వంతెనకు కోట్లాది రూపాయలు వెచ్చించారని గుర్తు చేశారు. జల జీవన్ మిషన్ ఓహెచ్‌ఎస్ఆర్ ట్యాంకు నిర్మాణం చేస్తున్నారన్నారు. వెయ్యి మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని, దీనికి 25 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి పట్టాలిచ్చారని అన్నారు. గుండుగొలనులో అన్ని వర్గాలకు న్యాయం చేయాలన్న ఉద్దేశ్యంతో ఎమ్మెల్యే వాసుబాబు సొసైటీ త్రిసభ్య కమిటీని మార్పు చేశారన్నారు. జి.మురళీ, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ జహీర్, నల్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు విశ్వబ్రాహ్మణుల అభినందన



ఎమ్మెల్యే వాసుబాబును అభినందిస్తున్న విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘ సభ్యులు

గణపవరం: విశ్వబ్రాహ్మణుల ఆరాధ్యదైవంగా కొలిచే శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాలకు దూపదీప నైవేద్యాలకు నెలకు రూ.5వేలు మంజూరు చేయడం అభినందనీయమని గణపవరం విశ్వబ్రాహ్మణ సంఘం పేర్కొంది. మంగళవారం ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును క్యాంపు కార్యాలయంలో సంఘం సభ్యులు కలిసి ప్రభుత్వ నిర్ణయంపై అభినందనలు తెలిపి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం తరపున వాసుబాబును సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాల్లో నిత్యపూజలు, దూపదీప నైవేద్యాలకు నిధులు మంజూరు చేయడం చాలా గొప్ప విషయమన్నారు. విశ్వబ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మశ్రీ తోలేటి శ్రీకాంత్‌కు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం కార్యదర్శి యండపల్లి పాండురంగారావు, గణపవరం మండల సంఘం అధ్యక్షుడు రామోజు ఏసుబాబు, గణపవరం వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు దేవరకొండ చంద్రశేఖర్, కార్యదర్శి కొమ్మోజు అశోక్, ఉపాధ్యక్షుడు కె.నాగబాబు, ముసినాని బాలాజీ పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం

దెందులూరు: ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల విషయంలో సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ మానవహక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కనికెళ్ళ మురళీకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ముప్పవరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు చట్ట ప్రకారం పదోన్నతుల్లో రిజర్వేషన్లు తప్పనిసరి అని ఇచ్చిన తీర్పు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల మానవహక్కుల పరిరక్షణతో పాటు వారిని సమాజంలో గౌరవించటమేనన్నారు. సమాజంలో అసమానతలు ఉన్నంతకాలం రిజర్వేషన్లు కొనసాగుతాయని మురళీకృష్ణ అన్నారు.

బాలుడిపై కుక్క దాడి

ఏలూరు టౌన్: ఏలూరు మాదేపల్లి ఇందిరాకాలనీలో బాలుడిపై కుక్క దాడి చేయటంతో తీవ్ర గాయాలయ్యాయి. పుట్టి అభిషేక్ (10) సోమవారం రాత్రి 9 గంటల సమయంలో తన ఇంటివద్ద రోడ్డుపై ఆడుకుంటూ ఉండగా కుక్క దాడి చేసింది. తీవ్ర గాయాలపాలైన బాలుడ్ని కుటుంబ సభ్యులు ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు.

సత్యవోలు ఛానల్‌ను అభివృద్ధి చేయండి

పెదపాడు: మండలంలోని సత్యవోలు కేఈ కెనాల్ ఛానల్ హెచ్ ప్రాంతాన్ని మంగళవారం ఉదయం జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, ఇరిగేషన్ డీఈ కొడాలి బాబు, ఏఈ సూర్యతేజ్‌తో కలిసి ఆయకట్టు ప్రాంత రైతులు పడుతున్న ఇబ్బందులను, సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఆయకట్టు రైతుల సూచనల మేరకు హెచ్ ఛానల్‌కు మరమ్మతులు చేపట్టాలని హైడ్రాలిక్ పాయింట్లు ఏర్పాటు చేయాలని కోరారు. విజయవాడ ఇరిగేషన్ సర్కిల్ పర్యవేక్షణ ఇంజనీర్‌కు ప్రతిపాదనలు పంపిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఛానల్ పరిధిలో వసంతవాడ, సత్యవోలు, సకలకొత్తపల్లి, కొణికి రాజుపేట గ్రామాలకు చెందిన సుమారు 3,500 ఎకరాల ఆయకట్టు ఉందని రైతులు చెప్పారు. ఏటా సక్రమంగా నీరందక దిగుబడి నష్టం జరుగుతోందని చెప్పారు. యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సత్యవోలు గ్రామ పరిసర ప్రాంత రైతులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్ధారణపై ఇంటింటి సర్వే

భీమడోలు: కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా మండలంలో పూళ్ల, గుండుగొలను పీహెచ్‌సీ పరిధిలో కుష్టు వ్యాధి నిర్ధారణపై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని ఆశ వర్కర్, ఏఎన్ఎంలు బృందాలుగా ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరినీ సర్వే చేస్తున్నారు. శరీరంపై రాగి, బూడిద మచ్చలు, స్పర్శ తెలియని మచ్చలు గుర్తించి పరీక్షలు చేస్తున్నట్టు పూళ్ల వైద్యాధికారి బి.లీలా ప్రసాద్ మంగళవారం తెలిపారు. మండల పరిధిలో గుండుగొలను, పూళ్ల పీహెచ్‌సీ పరిధిలోని సుమారు 18,500 గృహాలను సందర్శిస్తారన్నారు. ఈనెల 26 నుంచి జూలై 16వ తేదీ వరకు వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటారని, అవసరమైన మందులను పంపిణీ చేస్తామని ఆయన పేర్కొన్నారు. పూళ్ల పీహెచ్‌సీ పరిధిలో 7,825 గృహాలను సందర్శిస్తామని తెలిపారు.

పాఠశాలకు వంట పాత్రల వితరణ

భీమడోలు: భీమడోలులోని డాక్టర్ సత్యం ఫౌండేషన్ ఆర్థిక సాయంతో భీమడోలు-4 ప్రాథమిక పాఠశాలకు మంగళవారం అవసరమైన వంట పాత్రలు అందించారు. ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకంలో చిన్నారులకు పోషక విలువలు గల ఆహారాన్ని అందిస్తోంది. మధ్యాహ్న భోజనం తయారీకి అవసరమైన వంట సామగ్రి పాడవ్వడంతో పాఠశాల హెచ్‌ఎం, టీచర్లు ఈ విషయాన్ని ఫౌండేషన్ అధినేత బాలనాగు విజయసారథి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన రూ.12వేల ఆర్థిక సాయంతో వంట పాత్రలను అందించారు. ఇటీవల పాఠశాల-1కు ఫౌండేషన్ ద్వారా రూ.11వేల విలువ గల వంట పాత్రలను అందించారు. ఫౌండేషన్ ప్రతినిధులు బాలనాగు విజయసారథి, శైలజను ఘనంగా సన్మానించారు. అనంతరం పేరెంట్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అమ్మ ఒడి పథకం, విద్యా కానుక కిట్లను చిన్నారులకు అందించారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఝాన్సీ, హెచ్‌ఎం బుల్లి దొర, టీచర్లు ఎం.శరీన్, పరమానందం పాల్గొన్నారు.